ఉదయ రేకలు ఇంకా పూర్తిగా విచ్చుకోనేలేదు. పైనుంచి వేలాడుతున్న పొగమబ్బు పరదాలు పక్కకు తప్పుకోనేలేదు.

చక్రవర్తి మెల్లగా గేటు తీసుకుని లోపలకు వచ్చాడు. కోల మొహం, దుబురు గడ్డం. ఆకుచెప్పులు, లాల్చీ పైజమా వేసుకున్నాడు. లోపలకు వస్తూనే "నమస్కారం మాష్టారూ!" అన్నాడు వినయంగా, వరండాలో వాలుకుర్చీలో కూర్చుని. కాగల కార్యం ఏ గంధర్వుడు తీరుస్తాడా? అని తనలో తనే మల్లగుల్లాలు పడుతున్న వెంకటప్పయ్యతో. అన్నాడు చక్రవర్తి. "ఎందుకింత పొద్దున్నే వచ్చారని కదూ మీ రడిగింది? ఏం చేస్తాం. అవసరం!!"

"ఎంతవసరం వున్నా ఈసారి నేను హెల్ప్‌లెస్ చక్రవర్తీ! నువ్వు మరోలా అనుకోవద్దు. నాసంగతి నీకు తెలుసుకదా.

# అంతరార్థం

## కొండుముది శ్రీరామచంద్రమూర్తి

వెంకటప్పయ్య యాభయ్యో పడిలో పడి అయిదారేళ్ళకు పైనే అయింది. తలమీద జుట్టు కొంత తెల్లబడింది. కొంత రాలి పోయింది. నొసటి మీదికి ముడుతలు. కంటి మీదకు జోడు వచ్చాయి. పాతికేళ్ళకుపైగా క్లాసుల్లో అరిచిఅరిచి గొంతు జీరపోయింది చక్రవర్తిని చూడగానే అతని మొహంమీద ముడతలు మరింత దగ్గరకు ముడివడ్డాయి.

"వేళాపాళా లేదు దరిద్రుడికి!" అనుకున్నాడు లోలోపల.

పైకి మాత్రం పెదిమల మీదికి నవ్వు నటించుకుని "రావోయ్ రా!" అంటూ బల హీనంగా అని, కూర్చోమని వో కుర్చీ చూపించాడు


చక్రవర్తి కూర్చున్న తర్వాత. "ఏవి టిలా పొద్దున్నే వచ్చావ్?" అన్నాడు సూటిగా. మన మధ్య మర్యాదలూ, లాంఛ నాలూ ఎందుకన్న ధోరణిలో

వెంకటప్పయ్య, చక్రవర్తీ ఒకే కాలేజీలో పని చేస్తున్నారు. ఒకే డిపార్టు మెంట్‌లో కొలీగ్స్‌గా వుంటున్నారు ఒకరి అనుభవమంత మరొకరి వయసు.

చక్రవర్తి చొరవగా అడిగాడు. "అప్పుడే కాఫీల కార్యక్రమం అయిపోయిందేవిటి?" వెంకటప్పయ్య సమాధానం చెప్పేలోగానే. లోపల్నించి సమాధానం వచ్చింది.

"ఇంకా పాలు రాలేదు అన్నయ్య గారూ!"

"పోన్లెండి అక్కయ్యగారూ!" అని నవ్వుతూ అని, వెంకటప్పయ్య వేపు తిరిగి




ఐయామ్ ఆల్‌వేస్ యువర్ బెనిఫేక్టర్!! నువ్వడగంగానే ఎన్నిసార్లు నీ అవసరానికి నేనాదుకోలేదు? కానీ యిప్పుడు మా పెద్ద మ్మాయి పెళ్ళి ఒకటి నెత్తిమీదకు వచ్చి కూర్చున్నది గదా? ముహూర్తానికి వారం రోజులు ముందుగానే అనుకొన్న కట్నం తన చేతుల్లో పోసితీరాలని వియ్యంకుడు గారు కబురు పంపారు." అంటూ వెంకటప్పయ్య తన స్థితి వివరించాడు.

"ఎంతేవిటి కట్నం?" చక్రవర్తి సాను భూతిగా అడిగాడు.

"ఎంతైతే ఏంలే. కట్నం కట్నమేగా!"

"ఆఁ ఏంలేదు నిన్న సాయంకాలం మీరు పరబ్రహ్మశాస్త్రిగారి దగ్గరకు వెళ్ళా రట కదా, వో అయిదువేలు తక్కువైందీ. వీలయితే సర్దమనీ!"

పరబ్రహ్మశాస్త్రిగారి దగ్గరకు తను వెళ్ళడం తనకూ. ఆయనకూ మాత్రమే తెలిసిన విషయం. అది చక్రవర్తికి ఎట్లా తెలిసిందాఅని వెంకటప్పయ్య ఆశ్చర్యపడ్డాడు. తను పరబ్రహ్మశాస్త్రిగారి దగ్గరకే కాదు. ఇంకా అనేక మంది దగ్గ రకు కూడా వెళ్ళారు. అదంతా బట్టబయలు కాలేదుకదా అని భయపడ్డాడు. అమ్మాయి పెళ్ళికాదుగానీ. తను ఎంతో చిన్నతనం అనుభవించవలసివస్తున్నది. తన చిన్న తనం చక్రవర్తి దాకా కూడా పాకింది గదా అని బాధపడుతూ "ఆఁ!ఆఁ! వెళ్ళాను వె... ళ్ళా,....ను" అంటూ నీళ్ళు నమిలాడు వెంకటప్పయ్య.

"శాస్త్రిగారు మీకేం సాయంచేయగలరూ

వారికే నేను సాయం చేస్తేనూ!"

నమ్మశక్యం కానిదేదో చెవుల బడినట్లుగా చివ్వున తలెత్తాడు వెంకటప్పయ్య. ఆయన కళ్ళు పెద్దవయ్యాయి. కళ్ళజోడు ముక్కుమీదకు జారింది.

"నువ్వు ......... నువ్వాయనుకు సాయపడ్డావా?"

చక్రవర్తి నింపాదిగా అన్నాడు. "మీకు సాయపడదామనేఇప్పు డిక్కడకువచ్చాను!" జోక్ ఆఫ్ ది ఇయర్ విన్నట్టుగా పెడీపెడీ నవ్వాడు వెంకటప్పయ్య. "రియల్లీ?"

అవును. ఇదిగో అయిదువేలకు చెక్కు. దే పెడ్ టుడే!పదిన్నరకల్లా స్టేట్ బ్యాంకుకు వెళ్ళి మార్చుకోండి ఇందుకు మీరు నాకేం వడ్డీగట్రా ఇవ్వనక్కరలేదు. అసలిచ్చేయండి చాలు. అది కూడా అంతా ఒక్కసారే ఇవ్వనక్కరలేదు. ఇన్‌స్టాల్ మెంట్స్‌లో ప్రతినెల ఇంత అని ఇవ్వండి చాలు. అన్నట్టు మన కందరికీ బ్యాంకి ద్వారానే కదా పేమెంటు? బ్యాంకివారికి ఆథరైజేషన్ ఇవ్వండి. వాళ్ళే నెలకో నాలుగువందల చొప్పున మీ జీతంలో డిడక్ట్‌చేసి అది నా ఎకౌంట్‌కు రెమిట్ చేస్తారు. పన్నెండు నెలలూ అయిం తర్వాత. ఇంకా రెండు వందలు బాకీ ఉంటుంది కదా. డోన్ట్ వర్రీ ఎబౌట్ ఇట్! ఆ రెండు వందలూ మీ అమ్మాయికి నేనిచ్చే మేరేజ్ గిఫ్ట్—విత్ గుడ్ విషెస్!!

అంటూ అప్పటికే వెంకటప్పయ్య పేర రాసి తయారుగా ఉంచిన చెక్కును ఆయన చేతుల్లో ఉంచి. "వస్తానండీ!"అంటూ లేచి నిలబడ్డాడు చక్రవర్తి. అతని పెదిమల మీద పల్చని వెన్నెలవంటి చిరునవ్వు. కొద్దిగా వణకుతున్న చేతులతో చెక్కునందుకుంటూ. థ్యాంక్యూ- థ్యాంక్యూ రియల్లీ మిష్టర్ చక్రవర్తీ!" అన్నాడు వెంకటప్పయ్య. బరువుగా వున్న గొంతుతో.

"కాఫీ తాగి వెళ్దురుగాని. ఉండండన్నయ్యగారూ!" లోపల్నుంచి ఓ అభ్యర్థన వచ్చింది.

"ఈ సారికి క్షమించండక్కయ్యగారూ. మళ్ళీ వచ్చినప్పుడు!" అంటూ చక్రవర్తి హుందాగానడుస్తూ మెల్లగా గేటు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

అతను బయటకు వెళ్ళిపోయిం తర్వాత. లోపల్నుండిమంగళగౌరి గబగబా బయటకు వచ్చి భర్త చేతుల్లో నుంచి ఆ చెక్కును గభాలున లాక్కుని. దాన్ని అటూయిటూ పరీక్షగా చూస్తూ. "నిజంగా ఇది మంచి చెక్కేనంటారా!" అన్నది అనుమానంగా. ఆశగా.

"అంతా వైష్ణవ మాయలాగా వుంది!



చక్రవర్తేమిటి. నాకు చెక్కివ్వడమేమిటి? అతగాడు పేరుకు చక్రవర్తి గాని. ముళ్ళపూడి సృష్టించిన అప్పారావు పాత్రకు ఇతగాడే ఒరిజినల్!! ఏ నెల్లోనూ తన పూర్తి జీతం అతను ఇంటికి పట్టుకు వెళ్ళిన పాపాన పోలేదు. ఎవరి దగ్గర అప్పు తీసుకున్నాడో లిస్టు చెప్పడం కన్నా. ఎవరి దగ్గర తీసుకోలేదో ఆ లిస్టు చెప్పడం తేలిక. ఒకసారి తీసుకుంటే. తిరిగి ఆ మొత్తాన్ని వొకేసారిగా ఇవ్వడం వుండదు కదా! అసలును వీలయినన్ని ముక్కలుచేసి. ఒక్కొక్క ముక్కనూ సవాలక్షసార్లు అడిగించుకుని కానీ తిరిగి ఇవ్వకపోవడం చక్రవర్తి ప్రత్యేకత. అటువంటివాడు. అప్పుల మహారాజు. ఏక్‌దమ్‌న ఇంటికి వచ్చి అయిదువేల రూపాయల చెక్కు నా మొహాన అయిదు రూపాయల నోటులాగా విసిరికొట్టి. వడ్డీగిడ్డీ వద్దులెండి. అంటూ షేక్స్‌పియర్ నాటకం 'మర్చంట్ ఆఫ్ వెనీస్‌లో' ఆంటోనియోలాగా మాట్లాడమా?" అంటూ తలమీద వున్న నాలుగు వెంట్రుకల్నూ పీక్కున్నాడు "దీని రహస్యమేమి? వాట్ ఈజ్ దిస్ సీక్రెట్?" అంటూ నొసలు చిట్లించాడు

"రహస్యం సంగతి తరవాత. ఆ చెక్కు మారితే. ముందా చెక్కును మార్చుకుని డబ్బు తీసుకురండి. కట్నం సొమ్ము వియ్యాలవారికి అనుకున్న టైముకు అందజేస్తే. అదో గౌరవంగా వుంటుంది!" అనేసి మంగళగౌరి ఆ చెక్కును లోపలకు తీసుకుపోయింది.

ఇంగ్లీషు హెడ్ వెంకటప్పయ్య ఆ ఉదయం వేసుకున్న ప్రశ్నే. ఆ క్రిందటిరోజు సాయంకాలం తెలుగు పండిట్ పరబ్రహ్మశాస్త్రిగారు కూడా వేసుకున్నారు. చక్రవర్తి తన దగ్గరకు వచ్చి తనవసరం తెలుసుకుని. తనడక్కుండానే



కన్యలు భర్తలను తప్పించి మరి దేనినీ కోరరు; భర్తలు లభించిన తరువాత సమస్తాన్ని కోరుతారు. —షేక్‌స్పియర్

* * *

పాచికలతో వేసే పందాలన్నిటిలో పరమోత్కృష్టమైనది పాచికలను పారవేయటం. —నానుడి

* * *

వ్యంగ్యం రంపంలా ఉండకూడదు; కత్తిలా ఉండాలి. వ్యంగ్యం కోతకోయాలి కాని నలగ్గొట్టకూడదు —జెఫ్రి

* * *

తనకు ఉన్నదానితో సంతృప్తిచెందని వాడు తనకు ఉండాలని కోరుకునేదానితో సంతృప్తి చెందడు. —సోక్రటీస్

* * *

అవిశ్వాసం కన్నా మరి ఎక్కువ ఒంటరితనం ఏమున్నది? —జార్జి ఇలియట్

* * *

చుట్టూ చీకటి ఆవరించినప్పుడు వాడవలసిన సమయంలో క్రొవ్వొత్తి వాడినవాడే మేధావి. —షర్మ

* * *


నిమ్మకాయ అతిగా పిండితే చేదునిస్తుంది. ఏ పనైనా అతిగా చేస్తే దుష్ఫలితాలకు దారితీస్తుంది. —ఒరియా సామెత

* * *

మనిషి తన భావాలను సూటిగా చెప్పలేకపోయినప్పుడే కవిత్వం ద్వారా చెప్తాడు. —ఖలిల్

సేకరణ :

—డోకి కవిత, బరంపురం



ఓ వెయ్యి రూపాయలకు చెక్కు ఇచ్చినప్పుడు.

సరిగ్గా చక్రవర్తి, శాస్త్రిగారి ఇంటి ముందున్న వరండా మెట్లెక్కుతున్నప్పుడు, శాస్త్రిగారికి ఆయన భార్య శ్యామలాంబ చాంతాడంతున్న ఓ లిస్టును అందిస్తోంది- కూతురికి బంతి పెట్టడానికి

"లిస్టుతోపాటు నీ చేతులకున్న ఆ గాజులుకూడా ఇట్లాతగలెయ్. ఏ మార్వాడీ దగ్గరో తాకట్టెట్టి. సరకులట్టుకొస్తాను!" అంటున్నారు శాస్త్రిగారు విసకటగా

"అంత విసకటడితే ఎలాగండీ? ఆడపిల్లను కన్నతర్వాత ఈ ఖర్చులన్నింటినీ కూడా మనం తలొంచాలి మరి! పెద్ద కూతురు పెద్దమనిషైతే బంతి పెట్టడానికే మీరింతిదైతే. రేపు దాని పెళ్ళికి పురుళ్ళ వగైరాలకూ ఏమవుతారో నాకర్థం కావడం లేదుసుమ్మీ అండీ!"

"ఏమవడం ఏముందీ? ఆ వెంకటప్పయ్యలాగానే ఎక్కేగుమ్మం. దిగే గుమ్మంగా తిరిగి. 'అయ్యా! నువ్వయిదువేలిస్తావా. నువ్వు పదివేలిస్తావా!' అంటూ అడుక్కుంటాను. ఆడపిల్లనుకన్నతండ్రి అంతకన్నా ఇంకేం చెయ్యగలడీ దేశంలో!"

చక్రవర్తి రెండడుగులు ముందుకు వేశాడు. ఏమైనా చేస్తాడు. చక్కగా చదివిస్తాడు. లక్షణంగా ఉద్యోగం చేయిస్తాడు. ఆ చదువూ, ఉద్యోగం చూసి ముందుకొచ్చిన వాడిచేతే ఆ మూడుముళ్ళూ వేయిస్తాడు.

శాస్త్రి దంపతులు చక్రవర్తి చొరవకు ముందు కొంత ఖంగుతిన్నా. అంతలోనే సర్దుకున్నారు. తమ మాటలు అతను ఎట్లాగూ విని ఉంటాడన్న నిర్ధారణకువచ్చి ఇహ దాపరికం అనవసరం అనుకొని పరబ్రహ్మశాస్త్రి వేదాంత కంఠంతో అన్నాడు. "చదువూ, ఉద్యోగమూనూ! కూతురికి బంతిపెట్టుకోడానికి శికాణా కనబడ్డం లేదిక్కడ-నీకేం ఎన్ని కబుర్లైనా చెబుతావు! బరువూ, బాధ్యతా లేనివాడివి!"

చక్రవర్తి కొంటెగా అడిగాడు "బరువంటే ఏవిటండి శాస్త్రిగారూ?"

"బరువంటేనా?.... వెళ్ళి వెంకటప్పయ్యగార్నడుగు కట్నానికి అయిదు వేలు తక్కువై నానా కంగారూ పడుతున్నాడు ఆయన! పిచ్చివాడు. ఏ నీబోటివాణ్నో అడిగితే దొరికే మార్గమున్నా తెలుస్తుంది. నా దగ్గరకు వచ్చాడు. జోగీ జోగీ రాసుకుంటే రాలేదేముంది; బొట్టి బూడిద తప్ప."

అంతటి నిరాశలో వున్న శాస్త్రిగారికి చక్రవర్తి "ఖర్చులకుంచండి వడ్డీ సంగతి ఆలోచించకండి. నెలసరి వాయిదాల్లో ఇచ్చేసేయండి!" అంటూ వెయ్యి రూపాయలకు ఓ చెక్కు ఇచ్చి మర్నాడు మార్చుకోమనేసరికి ఆయనకూడా ఒక్కక్షణం మతి పోయినట్లయింది. అప్పుల చక్రవర్తి. దమ్మిడీ ఆదాయం లేని చక్రవర్తి. జీతంతో ఇంటిఖర్చులు పూర్తిగా గడుపుకోలేని చక్రవర్తి. ఉన్న తాత తండ్రుల ఇంటికే మునిసిపాలిటీ వారి పన్ను కట్టడానికే నానాయాతనపడే చక్రవర్తి ఉన్నపళాన తనకు వెయ్యి రూపాయలు అప్పుగా ఇచ్చేటంత స్తోమతను ఎక్కడినుంచి సంపాయించుకున్నాడూ! ఆ రహస్యంఏవిటీ?

శ్యామలాంబ హెచ్చరించేవరకూ పరబ్రహ్మశాస్త్రిగారు ప్రకృతంలోకి రాలేకపోయారు. పరబ్రహ్మశాస్త్రిగారే కాదు. ఇంకో నలుగురైదుగురు కూడా అదే సందిగ్ధంలో పడ్డారు. వైస్ ప్రిన్సిపాల్ జగయ్య. ఫిజికల్ డైరెక్టర్ యగ్గెన్న. లైబ్రేరియన్ ముక్తేశ్వరయ్యం. ఫిజిక్స్ లెక్చరర్ సూర్యారావులు కూడా చక్రవర్తి దగ్గర తమ అవసరాలకు చెక్కు అందుకని. చెక్కులిచ్చేంత డబ్బు చక్రవర్తి దగ్గరకు ఎట్లా చేరిందో తెలీక తికమకపడిపోయారు.

"ముదనష్టం ఏవన్నా చేరిందేమో!" అన్నాడు స్టాఫ్‌రూంలో నలుగురూ సమావేశమైనప్పుడు పి.డీ. యగ్గెన్న. అతనికి ముదనష్టం కథలంటే చాలా ఇష్టం. అకస్మాత్తుగా ఎవడైనా ధనవంతుడైపోతే, అతగాడికి ముదనష్టం ఏవన్నా వచ్చి చేరితీరాలని అతని గాఢనమ్మకం.

"మనకు తెలీకుండా చక్రవర్తికి లాటరీ ఏవన్నా తగిలిందేమో!" ముక్తేశ్వరం అన్నాడు సాలోచనగా. క్రిందటిసారి రెండుకోట్ల సిక్కింలాటరీ ప్రయిజు ఎనౌన్స్‌మెంట్ జరిగినప్పుడు ముక్తేశ్వరమూ మరికొందరు కలిసి ఓ సిండికేట్‌గా ఏర్పాటై తలా ఒక వెయ్యి రూపాయల టిక్కెట్లూ కొన్నారు. లాటరీ తగలడం అటుంచి, ముక్తేశ్వరానికి స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీలో వెయ్యి రూపాయల అప్పు మాత్రం గట్టిగా తగిలింది. అయినా అతనికి ఉన్నట్టుండి ఎవడికన్నా ధనయోగం పడితే, అతగాడికి డెఫినిట్‌గా లాటరీయే తగిలి తీరాలని ఓ గట్టి నమ్మకం. "ముదనష్టమూ లేదు లాటరీ లేదు మనకు తెలీకండా, ఏ కొంపో, గోడో వుంటే అదికాస్తా అమ్ముకుని వుంటాడు. ఇప్పుడిట్టా దర్జా వెలగబెడుతున్నాడు!" అన్నాడు జగ్గయ్య.

"అబ్బెబ్బే చక్రవర్తికి మనకు తెలీని ఆస్తిపాస్తులేమీ లేవు—ఆ ఉన్న పాతకాలం నాటి ఓ కొంప తప్ప. అందులోనే వుంటున్నాడు కాబట్టి అది అమ్మి ఉంచ

దానికి అవకాశం లేదు కదా అన్నారు మిగిలినవాళ్ళు.

వి. పి. జగ్గయ్య కనుబొమలు రెండూ దగ్గరకు చేర్చి ఆ మిష్టరీని విడగొట్టడానికి సీరియస్‌గా ఆలోచించడం మొదలెట్టాడు. తాను చెప్పింది తప్పు. మరొకటి జరిగి వుంటుందని ఆస్కారం లేదన్న ధోరణిలో పి. డి. యగ్నేన్న చుట్ట ముట్టించాడు. తను చెప్పిందానికి మిగిలిన వాళ్ళు ఔనన లేదన్న కోపంలో ముక్తేశ్వరం వో పుస్తకంలో తలదూర్చి నిప్పుకోడిగా మారిపోయ్యాడు. పి. యల్. సూర్యారావు మాత్రం మిగిలిన వాళ్ళ వేపు ఒకసారి సాభిప్రాయంగా చూసి, సన్నగా అన్నాడు. అతను పెద్దగా మాట్లాడితే రెండు గొంతులు వినబడతాయి.

"రిజిష్ట్రార్ ఆఫ్ ఎష్యూరెన్స్‌స్"లో ఎంక్వయిరీ చేస్తే ఇటీవల చక్రవర్తేమైనా అమ్ముకున్నదీ, లేకపోతే కొనుగోలుచేసిందీ తెలిసిపోతుంది కదా? అమ్ముకొనే ఉన్నట్లయితే ఆ డబ్బు విట్లా మనందరికీ మదుపు పెడ్తున్నట్లు. - లేదూ - ఏదన్నా ఎక్స్‌ట్రా ప్రాపర్టీనే కొనుక్కున్నాడు అంటే, డెఫినిట్‌గా అతనికి ఏదన్నా మదనష్టమో, లాటరీయో తగిలినట్లు!"

గుట్టుచప్పుడు కాకుండా ఆ సమాచారం సేకరించే భారం మళ్ళీ సూర్యారావుమీదనే పెట్టారు వాళ్ళు ముగ్గురూ.

సూర్యారావు రిజిష్ట్రార్ ఆఫీసుకు వెళ్ళి ఎంక్వయిరీ చేశాడు. అక్కడో తెలిసిన మొహం వుంటే.

ఆ తెలిసిన మొహం, చక్రవర్తి పోలిక లున్న మనిషెవడూ గత రెండు నెలలుగా తమ కార్యాలయంలో అడుగు పెట్టిన పాపాన పోలేదన్నాడు. ఫైళ్ళన్నీ వోపిగ్గా వెతికి చక్రవర్తి పేరుమీదుగా క్రయ విక్రయాలేవీ లేవన్న సంగతిని నిర్ధారించి మరీ చెప్పాడు.

చక్రవర్తి దగ్గర అప్పులు పుచ్చుకున్న వాళ్ళకంగరకూ వంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టుగా వుంది. మనసుమీద మహేంద్ర పర్వతం ఉన్నంత బరువు. ఎదుటివాడి రహస్యం తెలియకపోతే కలిగే ఆందోళన వాళ్ళను అతలాకుతలం చేసేస్తున్నది ఏవిటీ రహస్యం? వాట్ ఈజ్ దిస్ మిష్టరీ?

రహస్య భేదనం జరిగేలోగానే వెంకటప్పయ్య కూతురి పెళ్ళి కోలాహలంగా జరిగిపోయింది పరబ్రహ్మశాస్త్రి గారి కూతురికి బంతి పెట్టేశారు. జగ్గయ్య గారు తను కొత్తగా ఏర్పాటు చేసుకున్న స్టడీ రూంలో ఎయిర్ కండిషనర్ పెట్టించుకున్నారు. యగ్నేన్న ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్స్‌కు కలకత్తా వెళ్ళొచ్చాడు. ముక్తేశ్వరం సెకండ్ హాండ్ వెస్పా నొకదాన్ని కొనుక్కున్నాడు. సూర్యారావు రెండో కాల్ గ్యాస్ స్టవ్వూ, సిలెండరను సంపాయించుకున్నాడు

ప్రపంచంలో అందరూ తమకు కావలసినవి తాము ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎదుటివాడు బాగుపడే లోపునే తాము బాగుపడిపోవాలనుకుంటున్నారు. చక్రవర్తి సాయం పొందినవాళ్ళు కూడా అందుకు భిన్నంగా ఏమీ లేరు.

అయితే—

చక్రవర్తి అడిగిన ఆథరైజేషన్ లెటర్ మాత్రం, ఇస్తాం ఇస్తాం అంటూనే అందరూ వాయిదా వేసేశారు. ఆథరైజేషన్ లెటర్ లేకపోవడంతో నెలనెలా తమ తమ జీతాల్లో నుంచి ఇంత అని విధిగా మినహాయించి అది చక్రవర్తి ఖాతాకు జమచేయవలసిన అవసరం వాళ్ళకు తప్పిపోయింది.

"ఎందుకు మీరు పే చెయ్యటం లేదూ?" అని చక్రవర్తి ఎక్కడ అడిగిపోతాడో అని వాళ్ళు మొహం చాటెయ్యడం మొదలెట్టారు. కానీ ఎంతగా అతన్నించి తప్పించుకుపోదామన్నా, కొలీగ్స్ కావడంతో ఎక్కడో అక్కడ కలవకా తప్పడం లేదు. కలిసినప్పుడు చక్రవర్తిని చూసినప్పుడు.


విద్యుచ్ఛక్తి సరఫరాకు తగిన సాధనము

ఏవన్‌ప్లాస్ట్®

రిజిడ్ పి.వి.సి.
కాండ్యూట్ పైపులు.
16 మి.మి నుండి
63 మి.మి. వరకు లభిస్తాయ.



IS : 2509

MAP/A1/4484 TEL

ఏ వన్ ఇండస్ట్రీస్

ఇ7/1 యూనిటి బిల్డింగ్స్ బెంగళూరు 560002 ఫోన్: 225283/224801




ఒక్కొక్కళ్ళు ఒక్కోవిధంగా గిల్టీగా ఫీలుకాకా తప్పడం లేదు.

"అయ్యా !" వెంకటప్పయ్యగారూ ! మీ దగ్గర. వెధవది వంద రూపాయిలు అప్పు తీసుకుంటే వందసార్లడిగి. నిల్చున్నచోట నీళ్ళు తాగకుండా చేశారే- మూణ్నెళ్ళపాటు ఆ డబ్బును తిరిగి ఇవ్వ లేకపోయానని. దబాయించి నెలకు మూడు రూపాయల చొప్పున వడ్డీ వసూలు చేశాక- ఇప్పుడు : మీరు వడ్డీ కూడా ఇవ్వనక్కర్లేదు, నెలనెలా వాయిదాలు కూడా కట్ట కుండా నన్నిట్లా ఇబ్బందిపెట్టడం మీకు భావ్యమా?" అని చక్రవర్తి అడుగుతున్నట్లుగా వెంకటప్పయ్యగారికి కనిపించేది. కానీ చక్రవర్తి అట్లా అడిగేవాడు కాదు. వెన్నెల వంటి నవ్వు జగద్రహస్య సిద్ధాంతాన్ని తెలుసుకున్న ఏదో వేదాంత భావన. "ఏం- మాష్టారూ-కులాసాగా ఉన్నారా?" అని వెళ్ళి పోయేవాడు.

ఇదేం మనిషి? తన బాకీ అడగడేం? బాకీ వసూలు కాకపోయినా పర్వాలేని ఆర్థిక పరిస్థితా అతనిది? అప్పు పెట్టడమే ఒక మిస్టరీ అయితే. అప్పు వసూలుచేసుకునే ప్రయత్నం చెయ్యకపోవడం మరో మిస్టరీ అయింది.

పరబ్రహ్మశాస్త్రిగా రనుకునే వాడు. "చక్రవర్తీ! నీకు అప్పు కావలసిన సమయంలో నీ చేత తాకట్టుపెట్టిస్తేకాని అప్పివ్వించలేకపోయాను. ఆ తాకట్టు వాకట్టు అవుతున్నా నీకు సాయపడలేకపోయాను. మళ్ళీ ఇప్పుడు మాట తప్పుతున్నాను. ఏంచేయనయ్యా. శ్లేష్మంలో పడ్డ ఈగను! కానీ నీ విషయమే ఆశ్చర్యంగా ఉంది. లేమి అనే ఈ శ్లేష్మంలో నుంచి ఎట్లా బయటకు దూకేశావ్?....ఎట్లా?"

చక్రవర్తి రహస్యాన్ని గనుక తను కనిపెట్టేస్తే ఆ రహస్యాన్ని తనగుప్పెట్లో ఉంచుకుని చక్రవర్తిని అప్పు తిరిగి అడక్కుండా చేయవచ్చు కదా అనుకుని జగ్గయ్య. షరాబు కొట్లల్లో వాకబు చేయించాడు. ఫెయిలయ్యాడు దాంతో అతని మిష్టరీ అర్థంకాక చక్రవర్తి కనిపించగానే "హౌడుయు డూ" అంటూ కుశల ప్రశ్నలు వేస్తూ. టీ ఇప్పించి మర్యాద చేస్తో తన పబ్బం గడుపుకుంటున్నాడు

అయినా చక్రవర్తిలో అదే చిరునవ్వు. అదే ప్రశాంతత. ఇదివరలో తాను యితరుల దగ్గర అప్పుతీసుకున్నప్పుడు వాళ్ళను ఎంతటి చిరునవ్వుతో అడిగేవాడో ఇప్పుడూ అదే చిరునవ్వు. తాను అప్పు తిరిగి ఇవ్వలేకపోయినప్పుడు అవతలివాళ్ళు మొహం చిట్లించి అవమానకరంగా మాట్లాడుతున్నప్పుడు ఎంతటి ప్రశాంతతను కనబరిచాడో ఇప్పుడూ అదే ప్రశాంతత!

అతను ప్రశాంతంగా ఉంటున్న కొద్దీ వాళ్ళకు ఆందోళన ఎక్కువైంది. అతను చిరునవ్వుతో వాళ్ళను పలకరించినకొద్దీ వాళ్ళ మొహాలు మాడిపొయ్యేవి. చక్రవర్తి దగ్గర తీసుకున్న బాకీ అతని మొహాన కొట్టేసి ఋణ విముక్తులమైపోదాం అనిపించేది. కానీ అందుకు వెసులుబాటు మాత్రం కుదిరేది కాదు.

"ఏ పాపిష్టి ముహూర్తంలో ఆ చెక్కుల్ని పుచ్చుకున్నామో. ఎంతగా ప్రయత్నించినా అతగాడి బాకీ ఒక్క పైసా కూడా తీర్చలేకుండా పోతున్నాం," అనుకోవడం మొదలుపెట్టారు.

"ఆ చక్రవర్తి ఎన్నిసార్లు మన దగ్గర బాకీ పుచ్చుకున్నా. అదేమిటో విచిత్రం? పుచ్చుకున్నవాడు పుచ్చుకొన్నట్టు. అన్న ముహూర్తానికి ఇట్టే ఇచ్చేసేవాడు. ఋణ విముక్తుడై పొయ్యేవాడు. మనకా అదృష్టం లేకపోయింది" అంటూ బాధపడేవాళ్ళు.

వాళ్ళట్లా బాధపడుతూ ఉండగానే క్వార్టర్లీ సెలవులు వెళ్ళిపోయాయి. యూనివర్శిటీ వారు సెప్టెంబరు పరీక్షలు పెట్టడం. పేపర్లు దిద్దించడం జరిగిపోయింది. క్రిస్మస్. సంక్రాంతి రావడం. కాలేజీలు మూయడం తెరవడం కూడా అయింది. వేసవి ఎండలు గడపల దాకా వచ్చేశాయి.

ఉస్సురుస్సు రనుకొంటూ ఓ రోజు మధ్యాహ్నం వెంకటప్పయ్య. పరబ్రహ్మశాస్త్రి. జగ్గయ్య. యగ్గన్న. ముత్తేశ్వరం. సూర్యారావు ఇంకా మరి కొందరు స్టాఫ్ రూంలో సమావేశమైనారు ఇంటర్వెల్ సమయంలో.

వాళ్ళను చూసి అటెండరు దానియేలు కంగారుపడుతూ పరుగెత్తుకు వచ్చి "ఇన్నారా బాబూ ఇన్నారా ఈ విసయం?" అన్నాడు అతని కంఠంలో రవంత వణుకు.

"ఏవిటీ?" అందరూ ఏకకంఠంతో అడిగారు.

"చక్రవర్తి బాబుకు ఎమరేజ్ వొచ్చిందట! ఆస్పటాలకి తీసుకెళ్ళేలోపునే....!" దానియేలు మాట పూర్తిచేయలేకపోయాడు.


"ఆఁ" అందరూ నిశ్చేష్టులైపోయారు.

ప్రిన్సిపాలు చెవిన ఆ మాటవేసి. పర్మిషన్ తీసుకుని చక్రవర్తి ఇంటికి ఉరుకులు పరుగులుగావెళ్ళారు. కండోలెన్సు మీటింగు పెట్టడం. కాలేజీ మూసెయ్యడం వగైరా తతంగం అంతా ఆయనకే వొదిలిపెట్టేసి.

చక్రవర్తి ఇంటిదగ్గర. వరండాలో చాప మీద. తలదగ్గర దీపం పెట్టుకుని. మంచు గడ్డలమధ్య. పెదిమలమీద చెరగని చిరునవ్వుతో. మూసుకుపోయిన కళ్ళతో. పెరిగిన గడ్డంతో చక్రవర్తి ఇహబంధాలను తెంచుకున్నానన్న ధీమాతోవున్న మనిషన్నట్లుగా ప్రశాంతంగా పడుకుని కనిపించాడు. అతనికి పక్కన శ్రీలక్ష్మి కూచుని వుంది. ఎర్రని కళ్ళతో. పీక్కుపోయిన మొహంతో. చెదరిన జుట్టుతో. మాసిన చీరతో. దైన్యానికి రూపంగా. జరిగిన అన్యాయానికి జీవంగా!

సంప్రదాయ సిద్ధంగావున్న ఉపశమన వాక్యాల్ని పలికాడు పరబ్రహ్మశాస్త్రి ఆయన మాటలకు వంతపలికాడు వెంకటప్పయ్య. స్నేహితుడంటే చక్రవర్తే అన్నారు. మాటతప్పని హరిశ్చంద్రుడన్నారు. చేతికి ఎముకలేనివాడన్నారు నిత్యభోగి అన్నారు. నిర్వికారుడన్నారు.

అందర్నీ మాట్లాడనిచ్చింది శ్రీలక్ష్మి. అందరి మాటలూ ప్రశాంతంగా విన్నది ఆ ఇల్లాలు. "అంత గొప్పవాడా నా భర్త?" అన్నట్లుగా విస్ఫారిత నయనాలతో వాళ్ళ వేపు చూసింది. కూతుర్ని పొదివి పట్టుకుంది శ్రీలక్ష్మి తల్లి. ఎక్కడో నూతిలో గొంతుకలా అన్నది. "చుట్టూ ఉన్నవాళ్ళ




చిన్నబోతూ మెచ్చుకుంటే' ఆ మెప్పుదలలో కట్టుకున్నవాన్ని చిన్నబుచ్చిన వాడు బాబూ మీ స్నేహితుడు చక్రవర్తి!"

"ఇప్పుడా సంగతులన్నీ ఎందుకులే అమ్మా!" అంటూ తల్లిని అపవారించబోయింది శ్రీలక్ష్మి. కానీ కూతుర్ని లక్ష్య పెట్టలేదు ఆమె. పూడ్చుకుపోయిన కంఠంతోనే అన్నది." ఉండవే! నీకేం తెలుసు? ఇంకా ఎందుకూ దాపరికం? మనిషి బ్రతికున్నంతవరకూ ఇంటిగుట్టు ఇంటిగుట్టు అంటూ చేదువిషాన్నంతా గొంతులోనే దాచుకున్నావ్! ఇప్పుడైనా నలుగుర్నీ అసలు సంగతిని తెల్సుకోనీ!"

చేరిన వాళ్ళందరూ శ్రీలక్ష్మి తల్లి మాటల్ని శ్రద్ధగా ఆలకించడం మొదలెట్టారు అవతల చక్రవర్తి శవం. ఇవతల ఓ ఆడకూతురి కన్నీరు. మధ్యలో వో తల్లి మనోవేదన "ఏం బాబూ మా అల్లుడు మీ అందరి దగ్గరా అప్పులు తీసుకునేవాడట కదా?" అవునన్నట్టుగా మౌనంగా తల లాడించారు వాళ్ళు.

"తీసుకొన్న అప్పుల్ని అనుకొన్న సమయానికి తిరిగి ఇచ్చేయడానికి ఆయన పాపం ఎంతో ఇదై పోయేవారు!" శ్రీలక్ష్మి మెల్లగా అన్నది. "ప్రాణ స్నేహితులనుకొన్న వాళ్ళే ముక్కుపిండి వడ్డీ వసూలు చేసే వాళ్ళని ఎంతో బాధపడేవారు. అప్పు తీసుకొన్నందుకుగాను తనని గడ్డిపరకకిందతీసి పారేస్తూ మాట్లాడేవారని అవమానిస్తున్నారని పైకి తెలీనట్టుగా అవమానించేవారని. ఎన్నోసార్లు ఆయన కన్నీళ్ళు పెట్టుకున్నారు. అయినా అప్పుతీసుకోడమూ తప్పేదికాదు-. తీసుకున్న తరువాత తనలో తను కుమిలిపోడమూ తప్పేది కాదు!"

"ఆ లోపల లోపల కుమిలిపోవడమే ఇలా కొంపమీదకి తెచ్చిందే తల్లీ!" అంటూ ఉన్నట్టుండి పెద్దగా శోకించింది శ్రీలక్ష్మి తల్లి.

కొంచెం దూరంలో కూచున్నాడు శ్రీలక్ష్మి తండ్రి– తలపట్టుకుని. భార్య మాటలు విని తల పైకెత్తాడాయన. ఆయన కళ్ళు కోపంతో రవంత ఎరుపెక్కాయి. అల్లుణ్ని గురించి అంత తక్కువగా అంచనా వేసుకుంటావేం?" అన్నాడు.

శ్రీలక్ష్మి తల్లికి భర్తమాటలతో రోషం వచ్చింది "కుమిలిపోయేగా ఆ పాడు పని చేసింది" అన్నది కఠినంగా.

"అదేం పాడు పని కాదు. తనను అవమానించినవాళ్ళకు ఉపకారం చేసి. బుద్ధొచ్చేట్టు చేశాడు. తనముందు వాళ్ళు తలెత్తుకోలేనట్టు చేశాడు. తనని గడ్డిపరకకింద తీసిపారేసిన వాళ్ళకందరికీ.తనంటే ఏమిటో ఋజూ చేశాడు. తనెంత పెద్ద మనసుగలవాడో తెలియజెప్పాడు. తన ముందు వాళ్ళు చిన్నబోయేట్టు చేశాడు. ఇదంతా నాతో చెప్పుకుని మన చక్రవర్తి ఎంత రిలీఫ్ ఫీలయ్యాడో నీకేం తెలుసే పిచ్చిదానా?"

భర్త మాటలు మరింత కోపాన్ని తెప్పించాయి ఆ నడివయస్సు ఇల్లాలికి. చుట్టూ వున్న వారివేపు ఆమె కన్నీటి పరదాల గుండా చూసింది.

"లేని గొప్పలకు పోయి. అప్పులిచ్చి. అందర్నీ చిన్నబుచ్చి ఆనందించిన అల్లుడు మీ అల్లుడు. అమ్మాయిని కూడా నట్టేట్లో ముంచిన సంగతి మర్చిపోకండి!" అన్నది పరుషంగా.

"అమ్మా!" శ్రీలక్ష్మి మరోసారి తల్లిని ఆటంకపర్చాలని ప్రయత్నించింది. కానీ ఆమె వూరుకోలేదు గబగబా ఇంట్లోకి వెళ్ళి. టేబిల్లో వున్న ఓ కవరును తీసుకొచ్చి వాళ్ళముందు పడేసింది. "ఇది బాబూ మీ చక్రవర్తి ఘనకార్యం!!" అన్నది ఎగతాళిగా.

ముక్తేశ్వరం ఆత్రంగా ముందస్తుగా దాన్నందుకున్నాడు

ఎవరో బొంబాయి ఫైనాన్స్ కార్పొరేషన్ వాళ్ళిచ్చిన నోటీసు. ఇంగ్లీషులో ఉంది "అయ్యా చక్రవర్తిగారూ! మీరు సంవత్సరం క్రితం మీ ఇంటి తాలూకు ఒరిజినల్ డాక్యుమెంట్లు మాకు పంపించారు. ప్రామిసరీ నోటు రాసి డబ్బు తీసుకున్నారు. అప్పుమొత్తం ఒక్క సంవత్సరంలో తీర్చగలనన్నారు. తీర్చలేకపోతే ప్రామిసరీ నోటుతో జతచేసి పంపించిన ఇంటివిక్రయ ఖరారుపత్రాన్ని అమలుచేయవచ్చునన్నారు. మీకూ మాకూ మధ్యగల ఒప్పందం ప్రకారమే మా విజయవాడ బ్రాంచి నుంచి ఒక మనిషి వారంరోజులలో అక్కడకు వచ్చి. మీ ఇంటిని స్వాధీనం చేసుకోగలడు. ఏ విధమైన కష్టనష్టములు కలుగజేయకుండా సదరు మీతాలూకు ఆస్తిని మా మనిషికి స్వాధీనం చేయవలసినది!" అన్నది దాని సారాంశం.

శ్రీలక్ష్మి తల్లే అంటున్నది. "ఇచ్చిన అప్పులే వసూలు చేసుకునే తెలివితేటలు లేకపోయాయి. తను అప్పు తీసుకొంటున్నప్పుడు ఎంతగా బాధపడ్డాడో. తన దగ్గర అప్పులు తీసుకుని ఇతరులు అంత బాధపడితే చూసి సంతోషిద్దాం అనుకున్నాడు. వద్దండీ ఇటువంటి పన్లు" అని అమ్మాయి చెప్పబోతే దాని మీద ఖస్సుమన్నాడు. ఖస్సుమనడం మాత్రమే కాదు. ఎవరెవరికి ఎంతెంత ఇచ్చింది కూడా దానికి చెప్పలేదండీ! ఇప్పుడేం చెయ్యడం? మనిషి పోయినాడు. డబ్బు పోయింది. ఉన్న ఇల్లు పోతోంది." ఆమె నోటికి చెంగడ్డంపెట్టుకున్నది.

"పర్వానేదునెండమ్మా! అందరికీ సెక్కులే ఇచ్చినట్టు నాతో సెప్పాడా బాబు!" అన్నాడు దానియేలు.

"ఆ చెక్కుబుక్కు కనబడడం లేదు దానియేలూ!" శ్రీలక్ష్మి దీనంగా అన్నది. వెంకటప్పయ్య.పరబ్రహ్మశాస్త్రి. జగ్గయ్య. యగ్గెన్న. ముక్తేశ్వరం. సూర్యారావు ఒక్కసారి చక్రవర్తివేపు చూశారు. ఆ పెదిమల మీద ఇప్పుడు చిరునవ్వు కనబడడం లేదు. "బుక్కు లేకపోతే యేం? మీ మనసులకు తెలుసుగా?" అన్న ప్రశ్నను అడుగుతున్నట్లుగా వున్నాయి ఆ పెదిమలు. ఆ ప్రశ్నకు తట్టుకోలేనట్టుగా వాళ్ళందరూ ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. చక్రవర్తి తమ కందరికీ అప్పులెట్లా ఇచ్చాడో మిస్టరీ విడిపోయింది. కానీ ఇప్పుడు నిజం తెలుసుకున్న తర్వాత. వాళ్ళ హృదయాలు మరింత బరువెక్కుతున్నాయి. వాళ్ళ అడుగులు బరువుగా పడుతున్నాయి. వాళ్ళ మనసులకు ఒకే ఒక ప్రశ్న వచ్చి సూటిగా తగులుతున్నది. తామే కారణమా చక్రవర్తి మరణానికి?